క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగురు బాధితులకు కలిపి రూ.1.36 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించామన్నారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ యూత్ అధ్యక్షుడు అర్విండ్, పట్టణఅధ్యక్షుడు సంజీవ్, నాయకులు శ్రీనివాస్, యూనిష్, అన్వర్, ఇమ్రాన్, విక్కీ, రవి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కమ్మర్‌పల్లి: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి సత్తెక్క డిమాండ్ చేశారు. శుక్రవారం టీయూసీఐ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కమ్మర్‌పల్లిలో ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవో రాజశ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్తెక్క మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడంలేదన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అశోక్, రామాంజనేయులు, రాజేందర్, శిరీష, సత్యానంద్, ముత్తెన్న, రాజన్న, శ్రీధర్, గంగాధర్, సతీష్ తదితరులున్నారు.

మహిళా సంఘం పనులకు నిధుల మంజూరు

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో దుర్గాదేవి మహిళా సంఘం వద్ద అవసరమైన పనులు చేపట్టేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి రూ. 4 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పేర్కొన్నారు. ఐకేపీ ఏపీఎం మణిక్యంతో కలిసి నిధుల మంజూరు ఉత్తర్వును మహిళా సంఘం సభ్యులకు వారు అందజేశారు. ఈ నిధులతో సంఘం వద్ద మూత్రశాలలు, బోర్‌వెల్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, నెహ్రూ, రాజేందర్, భూమన్న, రమేశ్, చిన్నముత్తెన్న, సాయిరాం, భోజన్న, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి రూ.2.5 లక్షలు మంజూరు



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని సిర్పూర్ గ్రామంలో దుర్గామాత షెడ్డు నిర్మాణానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ తన నిధుల నుంచి రూ. 2.5లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షులు మగ్గిడి చిన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం సిర్పూర్ గ్రామంలో దుర్గామాత షెడ్డు పనులను కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పోతుగంటి సురేందర్, ప్రదీప్ రెడ్డి, జక్కం అనిల్, ముత్తన్న, శేఖర్, మధుష్ రెడ్డి, ప్రశాంత్, మోహన్, గంగాధర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



వర్ని: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మోస్రా మండలం గోవూరు గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని, నెరవేర్చని హామీలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భయపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కామారెడ్డి జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షులు అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రత్నకుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి

నందిపేట్(ఆర్మూర్): యువతను పెడదోవ పట్టించే మత్తు పదార్థాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో నందిపేట తహసీల్దార్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ మత్తు పదార్థాలు దొరుకుతున్నాయని, దొంగతనాలు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు లత, శోభ, రాజమణి, లలితచ ఏఐకేఎంఎస్ గంగాధర్ పాల్గొన్నారు.

గుంతల దారిలో వెళ్లేదెలా?

- అధ్వానంగా వెల్మల్-డీకంపల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ నుంచి ఆలూర్ మండలం డీకంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో అడుగడుగుకో గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ఎక్కువగా మూలమలుపులు ఉండడంతో పాటు గుంతలు ఉన్నాయి. దీంతో రెండు గ్రామాలకు వెళ్లే వారితో పాటు అటువైపు పంట పొలాలు ఉన్న రైతులు అవస్థలు పడాల్సి వస్తుంది. రోడ్డు గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. వర్షాలు కురవడంతో గుంతలలో నీరు నిలుస్తున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న వెల్మల్-డీకంపల్లి రోడ్డు



వెల్మల్ గ్రామంలో కంకర తేలిన రోడ్డు

భారీ గుంతలతో ముప్కాల్- మెండోరా రోడ్డు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రం వరకు గల తారు రోడ్డు గుంతలమయంగా మారింది. 2017 నుంచి ఇప్పటి వరకు ఆ రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. ముప్కాల్ మండలం నల్లూర్ చౌరస్తా నుంచి పెద్ద వాగు వరకు గల రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువపై జాతీయ రహదారి 63 నుంచి జాతీయ రహదారి 44 వరకు గల లింకు రోడ్డుపై నిర్మించిన వంతెనపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వంతెన ఇరుకుగా మారడంతోపాటు వంతెనపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఎదురెదురుగా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. మండలంలోని వేంపల్లి నుంచి రెంజర్ల వరకు గల తారు రోడ్డుపై గుంతలు ఉన్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురవడంతో గుంతలు వర్షం నీటితో నిండిపోతున్నాయి. దీంతో వాహనదారులు గుంతలు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



వెంచిర్యాల్ శివారులో కాకతీయ కాలువ వంతెనపై ప్రమాదకరంగా గుంతలు



ముప్కాల్ శివారులో మెండోరా – ముప్కాల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలను చైతన్యవంతులను చేస్తూ క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సూచించారు. ఆలూర్ మండలం దేగాం పీహెచ్‌సీ పరిదిలోని మగ్గిడి గ్రామంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పరిశీలించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 60 సంవత్సరాలు పైబడిన క్షయ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్నందున ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఆరోగ్య ఉప కేంద్రంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, సబ్ యూనిట్ అధికారి సాయి, హెల్త్ సూపర్వైజర్ అజీమా, టీబీ సూపర్వైజర్ సంతోష్, సిబ్బంది సోమ శేఖర్, ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేరు రాణి, గణేష్, జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మగ్గిడిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు చేయాలి

బాల్కొండ/పెర్కిట్ : రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీసీ) రైతులకు ఉపయోగపడే వ్యాపారాలను చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రాష్ట్ర అధికారులు నేహా అన్నారు. బాల్కొండ ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్‌పీసీ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నేహా మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు, పసుపు ప్రాసెసింగ్ ట్రేడింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ముప్కాల్ మండలంలో నాటుకోళ్ల పెంపకం మదర్ యూనిట్‌ను సందర్శించారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో మహిళ సంఘాలు చేపడుతున్న కూరగాయల సాగు, డెయిరీ, చేపల పెంపకం, నాటుకోళ్ల పెంపకాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రాష్ట్ర అధికారులు నేహా, సతీష్, రవీందర్, శిరీష పరిశీలించారు. జిల్లా అధికారులు రాచయ్య, రవి కుమార్, ఏపీఎంలు భూమేశ్వర్ గౌడ్, గంగారం, భూమేశ్, హిమబాల, రవి, రైతు ఉత్పత్తి దారుల సంఘం ఛైర్మన్ గంగామల్లు, సీఈవో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో మాట్లాడుతున్న మేనేజర్ నేహా

సార్వజనిక్ దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఎన్నిక

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో పట్టణ పెద్దలు శుక్రవారం సమావేశం నిర్వహించి 2025–26 సంవత్సరం నూతన సార్వజనిక్ దుర్గాదేవి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నంద్యాల శ్యామ్, కోశాధికారిగా పవన్, కోశాధికారిగా ఉద్మీర్ సందీప్, ఉపాధ్యక్షులుగా మసూలా సురేష్, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ చక్రేశ్వర శివాలయంలో ఈ నెల 22న శ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పట్టణ పెద్దలు రుద్ర సత్యం, గుమ్ముల అశోక్‌రెడ్డి, మసూల సాయిలు, పూజరి లింగం, బేంజర్ గంగారాం, హరికాంత్‌చారి, గోపి కిషన్, సాయిలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పట్టణ పెద్దలు, ప్రతినిధులు

సీపీఎం అగ్రనేత ఏచూరికి ఘన నివాళి



బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బోధన్/ఆర్మూర్‌టౌన్ : సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు పునరంకితమవుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా, డివిజన్ ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్మూర్ సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా, డివిజన్ ప్రతినిధులు నూర్జహాన్,పల్లపు వెంకటేశ్, శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్,నన్నేసాబ్,స్థానిక నాయకులు పోశెట్టి, రాములు, శ్రీకాంత్, సీపీఎం పార్టీ నాయకులు పల్లపు వెంకటేష్, ఎల్లయ్య, భూమన్న, రవి, బుల్లెట్, నవీద్, ఓంకార్, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

మాక్లూర్: మండలంలోని అమ్రాద్, ముత్యంపల్లి గ్రామాలలో నిజామాబాద్ ఉమెన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 చేపట్టిన సేవాకార్యక్రమాలు శుక్రవారంతో 5వ రోజుకు చేరుకుంది. అమ్రాద్‌లో జరిగిన వైద్యశిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేయగా నిజామాబాద్ రెడ్ క్రాస్‌సోసైటీ రక్తాన్ని సేకరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా విద్యార్థులు రక్తదానం చేయటం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ఆర్ మమత, కె మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత అభినందనీయం



బోధన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు చేయూత అందించడం అభినందనీయమని బోధన్ ఎంఈవో నాగయ్య అన్నారు. మండలంలోని భవానీపేట్ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన పల్లెపాటి కృష్ణ ప్రసాద్ వారి తల్లిదండ్రులు పల్లెపాటి సీతమ్మ– జగన్మోహన్ రావు జ్ఞాపకార్థం రూ.65 వేలు విలువ క్రీడ సామగ్రిని వితరణ చేశారు. ఈసామగ్రిని ఎంఈవో నాగయ్య చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఉపాధ్యాయులు. గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో క్విజ్ పోటీలు

వేల్పూర్: మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం మండల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ విభాగంలో మోతె హైస్కూలు విద్యార్థి ఎస్. ప్రభుకుమార్, ప్రాథమిక పాఠశాలల విభాగంలో పడగల్ ప్రైమరీస్కూలు విద్యార్థి ఏ. లిప్సిక ప్రతిభ కనబరచి బహుమతి పొందారు. ఎంఈవో రేణుక మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఆర్పీలు సయ్యద్ బాసిద్, సునీల్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూర్ మండలంలో ..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎమ్మార్సీ కార్యాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కల్లెడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని క్యాతిరేఖ ప్రథమ, ఆలూర్ జెడ్పీహెచ్ఎస్ కీర్తన ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే గుత్ప ప్రైమరీ స్కూల్ విద్యార్థులు శాన్వీ, రిషికేశ్ ప్రథమ స్థానంలో, ఆలూర్ ప్రైమరీ పాఠశాల నుంచి హరీష్, నవనీతలు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆలూర్ ఎంఈవో మేస నరేందర్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పీఆర్టీయూ నాయకులు అశ్ఫాక్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎంఈవో రేణుక, ఉపాధ్యాయులు

లింగాపూర్ వీడీసీ ఎన్నిక

నవీపేట: మండలంలోని లింగాపూర్ గ్రామాభివృద్ధి కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బత్తూర్ సాయిలు, ఉపాధ్యక్షులుగా బోయిడి లక్ష్మన్, ప్రధానకార్యదర్శిగా కరిపె మల్లేష్, కార్యదర్శిగా ముద్ద హరీష్,, సభ్యులుగా కిష్టన్న, నడ్పిసాయిలు, పోతన్న, లవణ్, రాజు, ఎర్రన్న లింగన్న, నర్సింగ్‌లు ఎన్నికయ్యారు.

విద్యార్థులకు అభినందన

కమ్మర్‌పల్లి: మండల అంతర పాఠశాలల క్రీడా పోటీల్లో ఆరు బహుమతులు పొంది ఉత్తమ ప్రతిభ చూపిన విజ్ఞాన జ్యోతి విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పీఈటీ బాలుకుమార్‌ను యాజమాన్యం సన్మానించింది. కరస్పాండెంట్ జి. దేవేందర్, హెచ్ఎం సౌమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీడీసీలను రద్దు చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): గ్రామాల్లో నియంతృత్వ పోకడలకు పోతున్న వీడీసీలను రద్దు చేసి బాధ్యులపై అధికారులు కేసులు నమోదు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ కోటగిరి రామగౌడ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో వీడీసీ సాంఘిక బహిష్కరణ చేసిన గౌడ కుటుంబాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీడీసీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ బొల్లారం రాజ్ కుమార్, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, గుర్రం రాజేష్, ఉమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.



పిప్రిలో మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కమిటీ నాయకులు

కిసాన్‌నగర్‌లో టీఎల్ఎం మేళా

బాల్కొండ: కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి టీఎల్ఎం మేళాను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తెలుగు, గణితం, ఇంగ్లిష్ పరిసరాల విజ్ఞానంపై బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలి

బాల్కొండ: విద్యాబోధనలో టీచర్లు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. కిసాన్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో సాంఘిక శాస్త్రం టీచర్ల కాంప్లెక్స్ సమావేశాన్ని పర్యవేక్షించారు. కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణవేణి, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌లు శ్రీనివాస్, నరేందర్ తదితరులున్నారు.

ఆర్మూర్‌లో భారీ వర్షం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్ని జలమయమయ్యాయి. వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వరదనీరు నిలిచిపోయింది. మురికికాలువలు పొంగిపోర్లాయి.

సంక్షిప్తం

కేసీఆర్‌ను కలిసిన రాజారాం యాదవ్



ఆర్మూర్: సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజారాం యాదవ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాతో పాటు ఆర్మూర్ ప్రాంతంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనారోగ్యం నుంచి కోలుకున్న కేసీఆర్‌ను పరామర్శించారు.

15న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం వివిధ కోర్సులలో ప్రవేశానికి ఈనెల15న స్పాట్ అడ్మిషన్స్‌కు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ టి. వేణుగోపాల్‌స్వామి అన్నారు. బీఏహెచ్ఈపీ ఇ/మీ, బీకాం సీఏ, బీఎస్సీ సైన్స్, బీఎస్సీ ఫిజికల్‌సైన్స్, బీఏహెచ్ఈపీ తె/మీ, బీఏ హెచ్ఈపీ ఉ/మీ, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ డీజిల్ ఎలక్ట్రానిక్స్‌లో సీట్లు కలవని, మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

చరిత్ర విభాగంపై వర్క్‌షాప్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న చరిత్ర విభాగంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు వర్క్‌షాపునకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాలలో నిర్వహించే వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీపీవోలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

వేల్పూర్: కొత్తగా నియమితులైన గ్రామ పాలనా అధికారులు గ్రామాల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని వేల్పూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో జీపీవోలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీపీవోలు తహసీల్దార్, ఆర్.ఐ. గోపాల్, సీనియర్ అసిస్టెంట్ స్వాతిని శాలువాతో సన్మానించారు. సమావేశంలో అధికారులు, గ్రామాల జీపీవోలు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్మూర్ పట్టణానికి చెందిన జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్ శుక్రవారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. అంతర పాఠశాలల గ్రామీణ క్రీడల నేపథ్యంలో పాఠశాలకు చెందిన 15 మంది కబడ్డీ క్రీడాకారులకు ఫౌండేషన్ తరపున క్రీడా దుస్తులను అందజేశారు. హెచ్ఎం గంగారాం, ఫౌండేషన్ ప్రతినిధులు బేల్దారి శ్రీనివాస్, దోండి నారాయణ వర్మ, డీజే సునీల్, కాశీనాథ్, ద్వారకనాథ్, అంబాదాస్ పాల్గొన్నారు.



అంతర్ పాఠశాలల క్రీడలు వాయిదా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బాలుర పాఠశాలలో 69వ ఆర్మూర్ (అర్బన్) మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడలు వాయిదా పడినటు అర్బన్ అంతర పాఠశాలల కన్వీనర్ లక్ష్మీన్సయ్య తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా క్రీడ మైదానం చిత్తడిగా మారడంతో క్రీడలను ఈనెల 18న, 19న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు

వేల్పూర్: వేల్పూర్ మండలంలో కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అయిదు రోజుల సీసీఎల్ మంజూరు ఉత్తర్వులను ఎంఈవో రేణుక శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు దేవానందం, సీ.వి.నరసింహారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పఠాని గంగాధర్, రాష్ట్ర కార్యదర్శులు దత్తప్రసాద్, చంద్రదేవ్, మహిళా ఉపాధ్యక్షురాలు శైలజ పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి

నవీపేట: మండలంలోని సొసైటీలలో యూరియాను అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్‌సింగ్ తహసీల్దార్ వెంకట రమణకు వినతి పత్రం సమర్పించారు. వరి పంట కోత దశలో ఉందని యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు.

15న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన

బోధన్: దివ్యాంగులు, చేయూత పెన్షనర్ల నెలసరి పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ ఆఫీస్‌ల ఎదుట ధర్నా కార్యక్రమం తలపెట్టామని బోధన్‌కు చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ రూ.4 వేల నుంచి రూ. 6వేలకు, చేయూత పెన్షనర్లకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీని ఇచ్చిందని గుర్తు చేశారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

మాక్లూర్: గ్రామంలోని అన్ని వీధులు పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపట్టాలని ఎంపీవో టి శ్రీనివాస్ పంచాయితీ కార్యదర్శి రాకేష్‌కు సూచించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మాక్లూర్ పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశవర్కర్లు ఉన్నారు.

హోమియో వైద్య శిబిరం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని శాపూర్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జేయస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల హైదారాబాద్ వైద్యులు ఆధ్వర్యంలో సు మారు 200 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులను అందజేశారు. డాక్టర్ జార్జీ ముల్లర్, శ్రీకాంత్, అనిల్, ప్రీ తమ్, ప్రవీణ్, మాజీ సర్పంచు మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట: మండలంలోని రాంపూర్, కమలాపూర్, జన్నెపల్లి, యంచ గ్రామాలలోని సబ్ స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. యంచ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మిగతా సబ్ స్టేషన్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌రూరల్: విద్యుత్ సబ్ స్టేషన్‌లో రెండో శనివారం మరమ్మతుల్లో భాగంగా చెక్కి క్యాంపు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయంలో కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ కల్యాణ్ శుక్రవారం తెలిపారు. అలాగే బోధన్‌సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని అన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బోధన్ టౌన్ ఏఈ నాయిని కృష్ణ శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

గోదావరి నదిలో సామూహిక పితృతర్పణాలు



నవీపేట: మండలంలోని యంచ గోదావరి నది తీరంలో శ్రీ ఓం జగదాద్రి పీఠాధిపతి స్వర్ణ కమల లక్ష్మి, శ్రీ ఓం పంచశక్తి పీఠాధిపతి జ్ఞాన శక్తేంద్ర స్వామిల ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక పితృతర్పణాలను నిర్వహించారు. నదిలో పడి మృతి చెందిన గుర్తు తెలియని అనాథలతో పాటు ఎక్కడెక్కడో మృతి చెంది ఎవరూ లేని అభాగ్యుల ఆత్మకు శాంతి కలగాలని శాస్త్రోక్తంగా పిండ ప్రదానం నిర్వహించారు. అనంతరం జగదాద్రి ఆలయంలో అన్నదానం చేశారు. ప్రతి ఏటా పితృపక్షంలో భరణి నక్షత్ర సమయంలో ఈపితృతర్పణాలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ లహరి ప్రవీణ్ తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

బోధన్‌రూరల్: భారీ వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని శాస్త్రవేత్తలు సుప్రజ, ఇందుర్ రెడ్డి, భారతి, బలరామ్‌లు అన్నారు. బోధన్ మండలం బండార్‌పల్లిలో రైతులు సాగు చేస్తున్న పంటలను రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం, రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.